ప్రజాశక్తి

ఆదివారం 11 డిసెంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రైతు విలవిల

కె.కోటపాడు మండలం చౌడువాడ పంచాయతీ పాచిలవానిపాలెంలో తడిచిన వరి పంట

- తడిసిన కోసిన వరిచేను
- అనకాపల్లి జిల్లాలో 13.5 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

మాండూస్ తుపాను ప్రభావం జిల్లాపై పడింది. వరి పంట తడిసిన రైతులు పంట పోతుందని విలవిల్లాడుతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన వర్షాలకు కోసిన వరిచేను పొలాల్లో తడిసింది. ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యాపితంగా దాదాపు 15వేల ఎకరాల్లో రైతులు వరిచేను కోశారు. చేను ఎండాక కుప్పలు పెట్టుకుందామనేలోపు తుపాను రావడంతో అది వర్షాలకు తడిసింది. వర్షాలకు భయపడి ఆరకుండానే కుప్పలు వేసుకున్నా పంట నష్టం కూడా జరగనుంది. అయితే శనివారం నాటికి వరి పంట నష్టం నమోదుకాలేదని జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు ప్రజాశక్తికి తెలిపారు. శనివారం కురిసిన వర్షాలకు జిల్లాలో 13.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాంబిల్లి మండలంలో 34,2, అత్యల్పంగా గొలుగొండలో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. స్వల్ప గాలులు కూడా వీయడంతో కోయాల్సిన వరిపంట నేలకొరిగింది. పంట చేతికి రావాల్సిన సమయంలో తుపాను రావడంతో రైతుకు కొంత నష్టం వాటిల్లనుంది. వర్షాలు ఎక్కువైతే రైతులు భారీగానే నష్టపోనున్నారు.

వర్షాలకు పంట నష్టంలేకుండా కొన్ని పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కె.రాజారెడ్డి సహా వ్యవసాయశాస్త్రవేత్తలు ఎంఎంవి శ్రీనివాసరావు, డాక్టర్ కె.లక్ష్మణ్ కొన్ని సూచనలు చేశారు.

ఇవీ సూచనలు

కోతకు ముందు వర్షాలు పడితే లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు నీటిని వెన్నుపై జల్లాలి. పనలమీద తడిసిన పంటకు ఉప్పు ద్రావణంలో కంకులను ముంచి ఆరబెట్టి చిన్నచిన్న కుప్పలుగా వేయాలి. లేదంటే తడిచిన చేను ఆరాక కుప్పలుగా వేస్తే ఉప్పు పొడిని కంకులపై చల్లాలి. నూర్చిన తరువాత ధాన్యం తడిస్తే క్వింటాకు ఒక కిలో ఉప్పు, నాలుగు కిలోల ఊక లేదా ఎండిన గడ్డి చిన్నచిన్న ముక్కలుగా చేసి కలిపి కుప్పగా పోసి వారం రోజుల తరువాత ఆరబెట్టాలి.

జిల్లాలో వర్షపాతం

రాంబిల్లిలో 34.2, మునగపాకలో 22.4, యలమంచిలిలో 22.2, పరవాడలో 16.2, కశింకోటలో 15.4, సబ్బవరంలో 15, అచ్యుతాపురంలో 14.6, కోటవురట్లలో 14.2, నర్సీపట్నంలో 13.6, చీడికాడలో 13.4, కె.కోటపాడులో 13.4, మాకవరపాలెంలో 12.8, బుచ్చెయ్యపేటలో 12.6, ఎస్.రాయవరంలో 12.6, మాడుగులలో 12.4, రోలుగుంటలో 11.6, పాయకరావుపేటలో 10.2, దేవరాపల్లిలో 9.8, రావికమతంలో 9.2, నక్కపల్లిలో 9.2, చోడవరంలో 8.6, నాతవరంలో 7.6, అనకాపల్లిలో 6.6, గొలుగొండలో 5.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూస్తే సహించం

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూస్తే సహించేది లేదని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం స్పష్టంచేశారు. శుక్రవారం జరిగిన సిఐఐ గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్‌లో కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తూహిన్ కాంత్ పాండ్ కేంద్ర ప్రభుత్వం తరుపున మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మి తీరుతామని ప్రకటించడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్లాంట్ కార్మికులు, రాష్ట్ర ప్రజానీకం చేస్తున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఏది అనుకుంటే అది చేస్తాం అనే విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం ప్రకటనలు చేయడం తగదని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి మొండి వైఖరిని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాలూ తీవ్రంగా ఖండించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంపై పోరాటానికి సిద్ధంకావాలని కోరారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంవత్సర కాలంగా ఉద్యమం చేస్తుంటే, ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా మిత్రులైన అదానీ, అంబానీల సేవలో మునిగితేలుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. దేశభక్తి పేరు చెప్పి దేశంలో ఉన్న అన్ని ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ప్రభుత్వం తన అనుయాయులకు కారుచౌకగా కట్టబెట్టే కుట్రలను ప్రజలందరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని మోడీ ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ నగరానికి రాక

ప్రజాశక్తి-కలెక్టరేట్ : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో సమాచార పౌర సంబంధాల మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ బ్యాటరీ-5లో పేలుడు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

వార్త మెయిన్‌లో..

చిట్టీల పేరుతో టోకరా

- రూ.కోటితో పరార్

వార్త మెయిన్‌లో..

ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సేవలు ప్రారంభం

వార్త మెయిన్‌లో..

స్టీల్ సిఐటియు మహాసభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

వార్త 4లో..

కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తే సహించం

స్టీల్ సిఐటియు మహాసభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

పందుల సంహారం...

ప్రత్యేక బృందాలతో జివిఎంసి 'స్పెషల్ డ్రైవ్'
9వ తేదీన ఒక్కరేజే 106 పందుల కాల్చివేత
నవంబర్‌లో 1250 ఏరివేత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలో పందుల సంహారంపై జివిఎంసి వెటర్నరీ విభాగ అధికారులు స్పెషల్ డ్రైవ్‌తో తమదైన శైలిలో 'పందుల నియంత్రణ ఆపరేషన్' (పిగ్ కంట్రోల్ ఆపరేషన్)లో ముందుకు సాగుతున్నారు. దొరికితే 'పట్టివేత... లేదంటే వేరేచోటకి చేరివేత... లేదంటే కాల్చివేత' విధానాన్ని జివిఎంసి అమలు చేస్తోంది. దీనికోసం నలగురు ప్రైవేట్ షూటర్లను ఏర్పాటు చేసుకుని రోజుకు 100 పందులను ఏరివేసే లక్ష్యాన్ని ఒక్కొక్కరికీ అప్పగించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, పెందుర్తి, గాజువాక, జ్ఞానాపురం, జోన్ -2 మధురవాడల్లో ఈ నెల 9న శుక్రవారం ఒక్కరోజే 106 పందులపై ప్రతాపం చూపడం విశేషం. అకస్మిక తనిఖీలతో వర్షం పడుతున్నా షూటర్లతో ఈ పందులను షీలానగర్, అనకాపల్లి రింగురోడ్డు ఏరియాల్లో నలుగురు షూటర్లతో వీటిని కాల్చివేశారు. గత నెల నవంబర్‌లో ఏకంగా 1250 పందులను నగరం నుంచి తీసిపారేశారు. అనకాపల్లిలో ఆదివారం ఓ గుడిలో మంత్రి కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పందులేవీ లేకుండా అక్కడ శనివారం స్పెషల్ డ్రైవ్‌ను జివిఎంసి అధికారులు నిర్వహించినట్లు తెలుస్తోంది. పందులు రోడ్లపైనా, వీదుల్లోనా ఆహారం కోసం పిల్లలపై దాడి చేస్తున్న ఘటనలు కూడా నగరంలో చోటుచేసుకోవడం, ఫిర్యాదులు కూడా రావడంతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను జివిఎంసి చేపట్టినట్లు తెలుస్తోంది.

3వేల పందుల తరలింపు...

నగరం నలుమూలలల నుంచి ఇప్పటికే 3వేల వరకూ పందులను ఇతర చోట్లకి తరలించినట్లు తెలుస్తోంది. పందుల మందల వాళ్లు కొన్నిటిని అమ్మేసుకున్నారు. విశాఖలో సంప్రదాయకంగా చూస్తే గాజువాక, పెందుర్తి పరిధిలో అధికంగా వీరు గూడారాలు వేసుకుని ఊరి శివార్లలో జీవిస్తున్నారు. విశాఖ నగరం మొత్తం మీద సుమారు 600కు పైగా కుటుంబాలు పందుల పెంపకం జీవనాధారం చేసుకుని ఉన్నాయి.

విశాఖ ఎగ్జిక్యూటివ్ కేపిటల్ కావడంతో....

నగర ప్రజానీకానికి తీవ్ర అసౌకర్యంగా పందుల పెంపకం అనేది మారిందని, అనేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించినా మిగతా 2లో..

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ డిమాండ్ చేసింది. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ 10వ మహాసభలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో సుమారు 10 వేల మంది ముఠా కార్మికులు లోడింగ్ అన్ లోడింగ్ పనులు చేసుంకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలు, ఇతర సరుకులు రవాణా చేయడంలో ముఠా కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా, ముఠా కార్మికులకు సమగ్రమైన చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం లేదన్నారు. వామ పక్ష పార్టీ అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో ముఠా కార్మికులకు అన్ని విధాలుగా అక్కడి ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని తెలిపారు. ముఠా కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముఠా కార్మికులు ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు వై.రాజు, జి. పోలీశ్వరరావు మాట్లాడారు. అనంతరం విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ

అధ్యక్షులుగా టి.పైడిరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.రమణ, రాము, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా నాయుడు, తాతారావు, కోశాధికారిగా పివిఎస్ఎన్.రాజు, ప్రతి ముఠా జట్టు మేస్త్రి కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

మొదటి పేజీ తరువాయి..

పందుల స్వైరవిహారం

ఎక్కడో శివార్లకు తీసుకెళ్లిపోవాలని సూచించినా పందుల పెంపకం దార్లు వినడం లేదని జివిఎంసి వెటర్నరీ సివిల డాక్టర్ ఎన్ కిశోర్ ప్రజాశక్తికి తెలిపారు. విశాఖ నగరాన్ని ప్రభుత్వం కార్యనిర్వాహక రాజధాని చేస్తున్న క్రమంలో పందులు ఒక ఆటంకంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. జివిఎంసి పరిధిలో సుమారు 15వేలకు పైగానే పందులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విశాఖలోని పెందుర్తి, గాజువాక, మల్కాపురం, జ్ఞానాపురంలో అధికంగా పందులున్నట్లు డాక్టర్ ఎన్ కిశోర్ తెలిపారు. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) పరిధిలోని 3, 4 జోన్‌లలో పందుల ఫ్రీ జోన్‌గా చేశామని వెల్లడించారు. జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు ప్రత్యేక అనుమతులతో ఈ స్పెషల్ డ్రైవ్‌లో పందుల ఏరివేత నిర్వహిస్తున్నట్లు వెటర్నరీ అధికారి తెలిపారు. కొన్ని చోట్ల పందుల పెంపకదార్లపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. అయినా మార్పు రావడం లేదని తెలిపారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ నగరానికి రాక

శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, సమాచార శాఖ సిబ్బంది, వివిధ పత్రికా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరైన అనంతరం శ్రీకాకుళం పర్యటనకు వెళతారు. ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎమ్. బాలగంగాధర్ తిలక్ హాజరయ్యారు.

ఒఎస్‌టి కేంద్రంలో సమీక్షిస్తున్న డాక్టర్ కిశోర్

ఒఎస్‌టి సిబ్బంది పనితీరు భేష్

ఎపిఎస్ఎసిఎస్ జాయింట్ డైరెక్టర్ కిశోర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : నగరంలోని ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రిలోని ఒపియాయిడ్ సబ్‌స్టిట్యూషన్ థెరపీ (ఒఎస్‌టి) కేంద్రం ద్వారా మంచి సేవలు అందుతున్నాయంటూ సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఎపిఎస్ఎసిఎస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ అభినందించారు. శనివారం ఒఎస్‌టి కేంద్రాన్ని సందర్శించిన ఆయన రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. మత్తు ఇంజక్షన్లకు అలవాటుపడితే జీవితాల్లో ఎటువంటి ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయో ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. యూనివర్శిటీలు, కాలేజీలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కోసం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరుచేస్తామని తెలిపారు. ఒఎస్‌టి సేవలు ప్రజలు వినియోగించుకొనేందుకు టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటుచేయాలన్నారు. ఆయనతో పాటు నోడల్ అధికారి, మెంటల్‌కేర్ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, జిల్లా సూపర్‌వైజర్ వీరభద్రరావు, ఒఎస్‌టి, ఎన్‌జిఒ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ ప్రగతికి సహకార సంఘాలు దోహదం

జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ సిఇఒ డివిఎస్ వర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడడానికి, దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడ్డాయని జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ సిఇఒ డివిఎస్.వర్మ అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యాన 'సహకార రంగం దాని ప్రాముఖ్యత' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా దేశ వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందని, తద్వారా గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజల జీవన విధానం మెరుగుపడిందని తెలిపారు. సొసైటీ పాలకవర్గాలు పారదర్శకంగా పనిచేస్తే ఆయా సభ్యులకు మెరుగైన ప్రయోజనాలు అందుతాయన్నారు. విశిష్ట అతిథి జిల్లా కో-ఆపరేటివ్ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.సత్యశ్రీ మాట్లాడుతూ, సహకార సంఘం అనేక ఆటుపోట్లకు గురౌతున్న నేపథ్యంలో ఐఎన్ సిఇ కో-ఆపరేటివ్ సొసైటీ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నడుస్తున్నదని ప్రశంసించారు. సూపర్‌వైజరీ కౌన్సిల్ మెంబరు రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ, అందరి కోసం ఒకరు, ఒక్కరి కోసం అందరూ అనే సహకార మౌలిక సూత్రాన్ని ఐఎన్ సిఇ కో-ఆపరేటివ్ సొసైటీ తుచ తప్పక అమలు చేయడం ద్వారా ప్రగతి సాధిస్తున్నదని తెలియజేశారు. సొసైటీ అధ్యక్షులు ఎస్.చిన్నారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో సభ్యులు ఎవి.రత్నాకర్‌రావు, వై.అంజని రాజేష్, కెవివివిఎస్‌డి.కుమార్, వేగి సత్యనారాయణ, వి.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపైనా ఉందని విశాఖ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మరపురెడ్డి కొండబాబు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 618వ రోజుకు చేరాయి. దీక్షల్లో డిజిఎన్ వర్కర్స్ యూనియన్, విశాఖ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు వారి వారి ఎజెండాలు పక్కనపెట్టి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్ కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్మికులతో కలిసి ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సూర్యప్రకాష్, కోశాధికారి వై.వెంకట్రావు, నాయకులు వికాస్, శ్యామ్, విశాఖ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు బి.శ్రీనివాస్, సత్యారావు, సాగర్, గోపాల్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాళిదాసుకు గౌరవ డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న జర్నలిస్టు కాళిదాసు

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : విజయవాడ పున్నమి ఘాట్‌లో జరిగిన యూనివర్శిటీ జాతీయ అవార్డుల స్నాతకోత్సవంలో సీనియర్ జర్నలిస్ట్ కూన కాళిదాస్‌కు అమెరికా గుర్తింపు పొందిన హోలీ స్పిరిట్ క్రిస్టియనిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సన్మానించారు. ఈ హెచ్‌ఎస్‌సి యూనివర్శిటీ నేషన్ అసోసియేషన్ ఫర్ థియాలజికల్ అసోసియేషన్ (నాటా), ఇండియా, డే స్ప్రింగ్ థియాలజికల్ యూనివర్శిటీ, టెక్సాస్, యుఎస్ఎలకు గుర్తింపు ఉంది. సమాజ హితమే పరమావధిగా కొన్ని దశాబ్దాలుగా గ్రామీణ, ఆదివాసీ సమస్యలపై అనేక కథనాలను, ఇంటర్వ్యూలను కాళిదాసు రాస్తున్నారు. ముఖ్యంగా తన కలాన్ని, గళాన్ని ప్రజల సమస్యల సాధన దిశగా అంకిత భావంతో పనిచేస్తున్నందుకు, బెస్ట్ సోషల్ సర్వీస్ విభాగంలో సోషల్ జర్నలిజానికి ఈ గౌరవ డాక్టరేట్ ఇస్తున్నామని హెచ్‌ఎస్‌సి యూనివర్శిటీ అధికార ప్రతినిధులు తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆనంద్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ సుమన దయాల్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ కూన కాళిదాస్‌కు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులు బెండి అరుణ, కూన వర్షిణి, బెండి శ్రీనివాస్, దవిల అనిత, దవిల మణి, పలు సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

దంత వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సిరిపురంలోని బాలాజీ నగర్‌లో ఇన్వర్టెంట్ ఇంటర్నేషనల్ డెంటల్ క్లినిక్ అండ్ ఆర్థో డొనెటిక్ సెంటర్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దంతాలను సంరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. క్లినిక్ యాజమాన్యం పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని రాయితీతో కూడిన వైద్యం అందించాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదాలపై సిపి సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సంవత్సర కాలంగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ శనివారం నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ట్రాఫిక్, ఎస్ఇబి విభాగాలతో సమీక్షించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రాంతాలు, ఏయే సమయాలలో ప్రమాదాలు జరిగాయి తదితర అంశాలపై విశ్లేషించారు. ప్రమాదాలు తగ్గు ముఖం పట్టే దిశగా అవగాహనా తరగతులు, స్టాప్ బోర్డులు, సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటుపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.

నగరాభివృద్ధే ప్రథమ కర్తవ్యం : మేయర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. 16వ వార్డు పరిధి హెచ్‌బి కాలనీలో అబ్దుల్ కలాం పార్కు, సచివాలయ భవనం అభివృద్ధికి కార్పొరేటర్ మొల్లి లక్ష్మి అప్పారావుతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వార్డులో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించామని తెలిపారు.

'మత్తు'ను నియంత్రించలేని జగన్ గద్దె దిగాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాలో దేశంలోనే ఎపి అగ్రభాగంలో ఉందని, వీటిని నియంత్రించలేని జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగాలని తెలుగు యువత విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్య దర్శి మొల్లి పెంటిరాజు డిమాండ్ చేశారు. తెలుగుయువత ఆధ్వర్యంలో శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు ఉపాధి కల్పించడంలో వైసిపి ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు.

ఘనంగా కైలాసగిరి కళంజియ సమాఖ్య మహాసభలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కైలాసగిరి కళంజియ సమాఖ్య మహాసభ శనివారం ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్ఆర్ మేనేజర్ గణేష్ మాట్లాడుతూ, సమాజంలో స్త్రీ అన్ని రంగాల్లో ముందుంటుందని, ఈ పొదుపు సంఘాలు అందుకు సహకారంగా నిలబడ్డాయని కొనియాడారు. రమాప్రభ పాల్గొన్నారు.

In the Court of the IV Additional District and Session Judge, Kakinada (MACT)

M.V.O.P. No. 127/2021

Between:

Yajjavarapu Ganesh ...*Petitioner*

AND

Pilli Raju and Others ...*Respondents*

To:

R-2: Pangi Sahadev, S/o. Mosya, age 46 years, Business, R/o. D.No. 24-10-4, LIG-400, Near Timphany School, Pedagantyada, Visakhapatnam, Owner of Lorry bearing No: AP 31 TF 3389.

పై నెంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.23-12-2022వ** తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు **ఉదయం గం॥ 10:30 ని॥లకు** మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

VEMANA ASHOK KUMAR
N.SRINIVASA RAO, Advocates
Kakinada Kakinada
10-12-22 Cell: 9553727777

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
O.S.266/2022

Between:
Mulakala Kamala ... Plaintiff
And:
Kottapalli Srinivasa Chakravarthy & 3 others ...Defendants

SUMMONS

To,
Defendant No.1:
Kottapalli Srinivasa Chakravarthy,
S/o. Satyanarayana,
Hindu, aged 55 years,
R/at D.No. 47-11-21,
Dwarakanagar,
Visakhapatnam-530016.

Please take notice that the above named plaintiff has instituted the above case against you and the matter stands posted to **23-01-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-01-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

S.P. PRABHU RAJU,
Advocate
Visakhapatnam,
Cell: 9182851131.

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
I.A.505/2022 in O.S.266/2022

Between:
Mulakala Kamala ...Petitioner/Plaintiff
And:
Kottapalli Srinivasa Chakravarthy & 3 others ...Respondents/Defendants

NOTICE

To,
Respondent No.1:
Kottapalli Srinivasa Chakravarthy,
S/o. Satyanarayana,
Hindu, aged 55 years,
R/at D.No. 47-11-21,
Dwarakanagar,
Visakhapatnam-530016.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above case against you and the matter stands posted to **23-01-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-01-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

S.P. PRABHU RAJU
Advocate
Visakhapatnam,
Cell: 9182851131.

కళాఉత్సవ్ పోటీల్లో కస్తూర్బా విద్యార్థుల ప్రతిభ

జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్, అనకాపల్లిలో కళాఉత్సవ్ -2022 పేరిట నిర్వహించిన వివిధ పోటీల్లో స్థానిక కెజిబివి విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్ఒ గంగాకుమారి తెలిపారు. అనకాపల్లిలో అండర్-19 బాలికల షూటింగ్ బాల్ పోటీల్లో కె పూజిత, పి ప్రియాంక, ఎన్ శిరీష జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. స్థానిక ప్రభుత్వ డైట్లో జరిగిన త్రీడీ, విజువల్ ఆర్ట్స్ పోటీల్లో కె.యామిని, ఏకపాత్రాభినయంలో ఆర్.శిరీష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ప్రిన్సిపల్ గంగాకుమారి, పిఇటి లక్ష్మి, షూటింగ్ బాల్అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసెఫ్ అభినందించారు.

గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : 87 వార్డు కణితి గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరి అనుపోత్సవం నిర్వహించారు. 108 రకాల వంటకాలతో సారె ఊరేగించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసిపి నేత బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, ఆడారి శ్రీను, కాంగ్రెస్ కనక, గౌరి సేవాసంఘం కమిటీ సభ్యులు అతికింశెట్టి రవి, మల్ల రాము, మళ్ల ప్రతాప్, కాంగ్రెస్ రమణారావు, అరవింద్, సిలపరశెట్టి గణేష్, ఎస్ పెంటరావు పాల్గొన్నారు.

అన్నదాత అవస్థలు

కల్లాల్లోనే ధాన్యం రాశులు

పొలాల్లో తడిసిన వరిచేను కుప్పలు

ధాన్యం నాణ్యత చెడుతుందని ఆవేదన

ప్రజాశక్తి -ఆనందపురం : మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. అనేకచోట్ల కోసిన వరి పచ్చిచేనును కుప్పలుగా వేయడం, తడి ఆరని ధాన్యాన్ని రాశులుగా పోగులు చేసినప్పటికీ, వర్షం కొనసాగితే ధాన్యం నాణ్యత చెడిపోతుందని, చేను కుళ్లి పాడౌతుందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బోని, సిర్లపాలెం, పేకేరు, కుసులువాడ, ఆనందపురం, పొడుగు పాలెం తదితర గ్రామాలలో వరి పంట సాగు చేశారు. బోని గ్రామంలో 15 రోజుల క్రితమే వరి కోతలు కోసారు. అప్పటినుండి ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సరైన సౌకర్యాలు లేక కొంతమంది రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మేశారు. మిగిలిన కొంతమంది ధాన్యాన్ని నిలువ చేసుకోగా, అకాలంగా వచ్చిపడిన వర్షాలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. కుసలవాడ, పేకేరు, సిర్లపాలెం పొడుగుపాలెం, ఆనందపురం గ్రామాలలోవరిచేను కోసిన రైతులు మాండూస్ తుఫాన్ హెచ్చరికలతో వరి చేనును పొలాల్లోనే గాలికుప్పలు పెట్టారు. పచ్చి చేను కుప్పలు పెట్టడం వలన కుళ్లిపోయే అవకాశం ఉంటుందని, తుఫాను తగ్గిన తర్వాత మరల ఆరబెట్టి కుప్పలుగాగానీ, నూర్పులు చేయాల్సి ఉంటుందని, మాండూస్ వల్ల ఒకే పనిని పదేపదే చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. 15రోజుల ముందే బోనీ రైతులు సిద్ధం చేసిన ధాన్యం అమ్ముడు పోక కల్లాల్లోనే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

బోని గ్రామంలో తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న అధికారులు

అధికారుల పరిశీలన

బోని గ్రామాన్ని శనివారం సివిల్ సప్లై డిఎం రాజేశ్వరి, వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు, పిఎసిఎస్ సభ్యులు ఎస్ నారాయణరావు పంచముఖి సందర్శించారు. కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు ముందు కోసిన రైతులు ధాన్యం తేమశాతం తక్కువగా ఉందని, ఇటీవల కోసిన రైతులు ధాన్యం పచ్చిగా ఉన్నాయని కొన్ని రోజులు ఆరబెట్టాలని రైతులకు సూచించారు

బోనిలో గొడౌన్ ఏర్పాటు చేయాలి

బోని గ్రామంలో వరి సాగు ఎక్కువగా ఉంటుందని, ధాన్యం నిల్వకు గొడౌన్ ఏర్పాటు చేయాలని పంట భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు ఆధ్వర్యంలో రైతులు సివిల్ సప్లై డిఎం రాజేశ్వరికి విన్నవించారు.

కట్టమంచి సేవలు చిరస్మరణీయం

నివాళులర్పిస్తున్న కృష్ణా రావు, తదితరులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఆంధ్ర విశ్వ విద్యాలయం అభివృద్ధికి డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు అన్నారు. శనివారం పిఎస్ఎం, జివిఎంసి ఉన్నత పాఠశాల ఆవరణలో కట్టమంచి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండలి గౌరవాధ్యక్షుడు గంటా సూకరాజుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎయు విసిగా కట్టమంచి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, నాగలక్ష్మి పాల్గొన్నారు. ఇదే పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు

ఆంగ్లభాషా పరిజ్ఞానం అవసరం

విజేతలతో దేవ కుమారి, భాగ్యలక్ష్మి, తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు తెలుసుకోవడానికి, ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరమని విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు బివి. దేవ కుమారి అన్నారు స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఆంగ్ల డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆంగ్ల విభాగాధిపతి ఎ. రోజా అధ్యక్షతన నిర్వహించినసమావేశంలో మాట్లాడుతూ, మాతృభాషతోపాటు ఆంగ్లం, ఇతర భాషలను నేర్చుకోవడం ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి, సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్, ఆంగ్ల అధ్యాపకులు ప్రేమలత, అబీదా బేగం, ప్రియ, జ్యోత్స్న తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

పెందుర్తిలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న రాజాన

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : వివక్షత లేని మానవ సమాజ నిర్మాణమే అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ లక్ష్యమని సొసైటీ ఆఫ్ ఇంటలెక్చువల్ వాయిస్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ఐఎం.అహ్మద్ అన్నారు. చినవాల్తేరులో ఐఎం అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మానవహక్కులపై అవగాహన కల్పించారు. జివిఎంసి కార్పొరేటర్, న్యాయవాది శశికళ మాట్లాడుతూ మానవహక్కుల పరిరక్షణ ద్వారా మానవత్వం, సమానత్వం సాధ్యమన్నారు. సెయింట్ ఆన్స్ సొసైటీ ప్రతినిధి, న్యాయవాది సిజియోల్ వర్గీస్, ముస్లిం మహిళా సంఘం అధ్యక్షురాలు షంషాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ : మానవహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు పౌర, ప్రజా సంఘాలు, విద్యార్థులు ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, 'భారత రాజ్యాంగం నేడు ప్రమాదంలో పడింది, రాజ్యాంగ బద్ధంగా లభించిన హక్కులను హరిస్తూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మానవ కనీస హక్కులను హరిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి.చంద్రశేఖర్, కె.పద్మ, ఆచార్య సూరప్పడు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : బివి. ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యాన ఎంవిపి కాలనీలోని ఎస్‌వివిపివిఎంసి డిగ్రీ కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ, యువత మానవ హక్కుల పరిరక్షణ కోసం అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : మానవ హక్కులను రక్షించాలని చైతన్య డిగ్రీ కాలేజీ అధ్యాపకుల సతీష్‌కాంత్ అన్నారు. స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం జరిగింది. ఆర్థిక, సామాజిక ఇతర హక్కుల కోసం ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి పాల్గొన్నారు.

తగరపువలస : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో 50 మంది గర్భిణులు, బాలింతలు, రోగులకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సీనియర్ ఉపాధ్యక్షులు శిరపు రామలక్ష్మి పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఉపాధ్యక్షులు కె కవిత, ఆర్.కరుణ, వెంకటేశ్వరరావు, డాక్టర్ సాయికుమార్ పాల్గొన్నారు

పెందుర్తి : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వన్‌టౌన్ ఎవిఎన్ కాలేజీ డౌన్‌లోని ఇండో హ్యూమన్‌రైట్స్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, రోజువారీ కూలీలు, భీమునగర్ నైట్‌షెల్టర్‌లోని నిరాశ్రయులకు, అలాగే విశాఖపట్నం ప్రేమ సమాజంలోని కుష్టువ్యాధి బాధితులకు దుప్పట్లు, పండ్లు, అవసరమైన మందులు పంపిణీ చేశారు. సంస్థ జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గవరయ్య, కోశాధికారి రాజాన విజయమ్మ, యూత్ ప్రెసిడెంట్ సుగుణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఇస్సాక్ సమర్థణరాజు, కృష్ణ, ఐహెచ్ఆర్సి సభ్యులు పాల్గొన్నారు

మాధవధార : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 51వ వార్డు మాధవధార వుడా లేఅవుట్‌లోని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్, రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహనరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు, ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, మాధవ్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పికె.పట్నాయక్, అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ విసి హనుమంతు లజపతిరాయ్, ఐఆర్‌టిసి అధికారి పి.సురేష్, వైసిపి రాష్ట్ర మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షులు బి రఘు తదితరులు పాల్గొని మానవహక్కుల సంఘం అధ్యక్షుడు రామ్మోహనరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, జెసిసి చైర్మన్ లజపతిరాయ్, చైల్డ్‌రైట్స్ కమిషన్ సభ్యుడు గొండు .సీతారాం, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, కృష్ణారావు మాస్టర్ బి. విజయ్, తిరుమలరావు, దమయంతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వందమందికి పైగా రక్తదానం చేయగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక ఇచ్చి ప్రోత్సహించారు.

మాధవధారలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న కెకె.రాజు

ములగాడలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

ములగాడ : వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మగౌరవంతో జీవించడానికి, సమాజ ప్రగతికి మానవ హక్కులు ఎంతో అవసరం అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ పాల్గొన్నారు. మానవ హక్కులపై విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

రికార్డు స్థాయిలో 66మందికి హెచ్‌పిసిఎల్ ఉద్యోగాలు

గురువులకు కృతజ్ఞతలు తెలిపిన కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

ప్రజాశక్తి -కంచరపాలెం: హెచ్‌పిసిఎల్ ఆపరేటివ్ టెక్నీషియన్స్ ఉద్యోగాలకు ఎంపికైన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా హెచ్‌పిసిఎల్ కెమికల్ విభాగానికి సంబంధించి 92 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, వేలాదిమంది పరీక్షలు రాశారు. విశాఖ ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజ్ (గైస్)కు చెందిన 66 మంది ఉద్యోగాలకు ఎంపికై రికార్డు సృష్టించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన ఇక్కడి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రిన్సిపాల్ వెంకటరమణ ఆధ్వర్యంలో పోటీ పరీక్షకు తర్ఫీదునిచ్చి తీర్చిదిద్దారు. దీంతో వారు పరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికై ప్రస్తుతం హెచ్‌పిసిఎల్‌లో శిక్షణ పొందుతున్నారు. వీరంతా ప్రిన్సిపాల్ వెంకటరమణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వి లక్ష్మణరావు పాల్గొన్నారు

కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తే సహించం

సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు

విజయవంతమైన స్టీల్ సిఐటియు 11వ మహాసభలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తే సహించేది లేదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం స్టీల్ సిఐటియు 11వ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడుతూ విశాఖ స్టీల్ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే అధికారులు, ప్రజా ప్రతినిధులను తమ పోరాటాల ద్వారా గుణపాఠం చెప్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా ప్రయివేటుకు కట్టబెట్టాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని, కార్మిక వర్గం మరింత అప్రమత్తమై విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిఘటనలు మాత్రమే ప్రభుత్వ రంగాన్ని రక్షించగలవని దేశంలో అనేక ఉదాహరణలు ఉన్నాయని, విశాఖ ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం దిక్సూచి కావాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి చేసే కార్మిక శక్తి వ్యతిరేకించిన చోట పెట్టుబడిదారుల ఆగడాలు సాగవని,ఆ దిశగా మన ఉద్యమాన్ని నిర్మిద్దామన్నారు. దేశవ్యాప్తంగా అనేక పోరాటాలలో సిఐటియు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్మిక హక్కులతో పాటు ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో సిఐటియు కార్యకర్తలు సైనికుల్లా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు ప్రద్యుత్ ముకర్జీ, నబేంద్ర సర్కార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి, కార్మికులను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి పూర్తి సహకారం అందజేస్తామని స్పష్టం చేశారు.

ఏడు తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం

మహాసభలో నూతన వేతనాలను తక్షణం అమలు చేయాలని, ఉత్పత్తికి అనుగుణంగా ఇన్సెంటివ్ చెల్లించాలని. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని,. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని తదితర ఏడు తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు.

స్టీల్ సిఐటియు నూతన కార్యవర్గం

అనంతరం స్టీల్ సిఐటియు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జె అయోధ్యరామ్, యూనియన్ అధ్యక్షుడిగా వైటి. దాస్, ప్రధాన కార్యదర్శిగా యు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పివిఎస్‌వి శ్రీనివాసరాజుతో పాటు 83 మంది కార్యవర్గసభ్యులుగాను, 14 మందిని కార్యదర్శివర్గ సభ్యులుగాను, 275 మందిని వర్కింగ్ కమిటీ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

జె.అయోధ్యరాం వైటి.దాస్ యు.రామస్వామి

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలి

ఉక్కునగరం :స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, సిఐటియు 13 మహాసభ తీర్మానించింది. శనివారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, సిఐటియు మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోపన్యాసం చేసిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ, సిఐటియు బలోపేతం అయితేనే స్టీల్‌ప్లాంట్‌కు మనుగడ ఉంటుందని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను మరింత ఉధృతంగా చేయాలన్నారు. మహాసభలను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలిపారు.

సిఐటియు సీనియర్ నాయకులు కె మల్లేశ్వరరావు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన ఆర్‌పి. రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి శ్రీనివాసరాజు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇటీవల మరణించిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు మహాసభ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సిఐటియు రాష్ట్రఅధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, కార్మికులంతా ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. సిఐటియు పోరాట విజయాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు జి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రమణ, కెఎం. శ్రీనివాస్, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు ప్రద్యుత్ ముఖర్జీ, నబెందు సర్కార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి కుమార్

వార్డులన్నింటినీ ఆదర్శంగా తీర్చిదిద్దుతా

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక: అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా చేపట్టడం ద్వారా ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 65వ వార్డు అశోక్‌నగర్, గిరిజాకాలనీలో రూ.28 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి శనివారం స్థానిక వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు.. కార్యక్రమంలో గౌరి శంకర్, సంజీవ్, సత్యనారాయణ, కిషోర్, శ్రీకాంత్, దేముడు, వాడపల్లి అప్పన్న, పెంట్ల రాజు, రాముడు, ప్రవీణ్, అడిగర్ల రమణ పాల్గొన్నారు

పార్టీ బలోపేతానికి బూత్‌స్థాయి కమిటీలు

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి బలోపేతానికి బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. శనివారం బిసి రోడ్‌లో జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రతి 50ఇళ్లకు గృహ సారథులను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

రజక కాలనీలో గడపగడపకూ...

సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఔట్ - 2 రజక కాలనీలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె రాజు, స్థానిక కార్పొరేటర్ కె. అనిల్ కుమార్‌రాజు కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయించి పనులు చేపడుతోందన్నారు. 26వ వార్డు ఇన్‌ఛార్జి పీలా వెంకట లక్ష్మి, కిరణ్ రాజు, ఆళ్ళ శ్రీను పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై వినతి

వైవికి వార్డుసమస్యలపై వివరిస్తున్న మందారెడ్డి

ప్రజాశక్తి - అరిలోవ : 12వ వార్డులో సమస్యలపై ముఖ్యంగా సింహాచలం దేవస్థానం భూబాధితులకు న్యాయం చేయాలని వైసిపి సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వార్డు వైసిపి నేత సత్తి మందరెడ్డి కోరారు. శనివారం టిటిడి ఛైర్మన్, ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా వైసిపిలో మొదటి నుంచి పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమం,తదితర విషయాలను వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వార్డు వైసిపి అధ్యక్షుడు కన్నేటి సుబ్బారెడ్డి ఉన్నారు.

సమిష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు నేత కుమార్

ప్రజాశక్తి- కంచరపాలెం : కార్మిక సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఎర్రజెండా నీడన సమిష్టిగా పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బిఎస్ఆర్ భవన్‌లో కంచరపాలెం జోన్ సిఐటియు 9వ మహాసభల ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కుమార్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని, తోపుడుబండ్లు, భవన నిర్మాణ, ముఠా, ఇంటి పని వంటి అసంఘటిత కార్మికులకు కేరళ తరహా పిఎఫ్, ఇఎస్ఐలతో కూడిన సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికచట్టాల రద్దు, ఇతర ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు పాల్పడుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి జగన్ సర్కార్, టిడిపి, జనసేనలు వంత పాడడం దుర్మార్గమన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

సిఐటియు కంచరపాలెం జోన్ కమిటీని 20 మందితో ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా బి.సింహాచలం, అప్పారావు, ఆఫీస్ బేరర్లుగా ఆర్.సత్యనారాయణ, పి.మూర్తి, మహేశ్వరి, సిహెచ్ అప్పారావు, డి.ప్రకాష్, ఎమ్ ఈశ్వరరావు, రాజుతల్లి, కమిటీ సభ్యులుగా కె రాంబాబు, పి రాజు, సీతామహాలక్ష్మీ, బిఎంకె మహేంద్ర, ఎమ్ కోటి, ఎన్ మోహన్, లలిత, ఎమ్ రాజు, పి సింహాద్రి, నాయుడు, సత్తిబాబులను ఎన్నుకున్నారు.

'ఉత్తరాంధ్ర పొలికేక'కు అనుమతుల తిరస్కరణ

వైసిపి పతనానికి నాంది

ప్రజాశక్తి-సీతమ్మధార : హైకోర్టు అనుమతులిచ్చిన ఉత్తరాంధ్ర పొలికేకకు నగర పోలీస్ కమిషనర్ తిరస్కరణతోనే వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని, జైభీమ్ భారత్ పార్టీ అధినేత, మాజీ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పులికేక సభకు హైకోర్టు ఇచ్చిన అనుమతి పత్రాలు చూపినా సిపి శ్రీకాంత్ వైసిపి కార్యకర్తలా వ్యవహరించి తిరస్కరించడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనిపై సిపి శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్లపై కోర్టుధిక్కరణ పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ సుధాకర్ పేరు పెట్టడమే ఇబ్బంది అయితే, పేరు కూడా తొలగిస్తామని చెప్పినా అనుమతులు నిరాకరించారన్నారు. విశాఖ విచ్చేసిన పవన్ కల్యాణ్‌ను వైసిపి ప్రభుత్వం బలవంతంగా తరిమేసిందన్నారు. ప్రతిపక్షాలకు మాట్లాడనీయకుండా నియంతలా వ్యవహరిస్తున్న వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనుమతులు ఇవ్వకపోవడానికి తమదేమైనా నిషేధిత జాబితాలో ఉన్న మావోయిస్టు సంస్థ అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ కన్వీనర్ కారం మమత, వినయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాది శ్రావణ్‌కుమార్

క్రీడలకు అనువైన వేదిక విశాఖ

కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మేయర్

ప్రజాశక్తి-సీతమ్మధార/ ఎంవిపి కాలనీ: అన్ని క్రీడలకు విశాఖ నగరం అనుకూలమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. శనివారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో విశాఖ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్, మేయర్ కప్-2022 పోటీలను సినీ హీరో సుమన్, ఉత్తర నియోజకవర్గం కెకె.రాజు, వైసిపి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నుంచి ఎంతోమంది క్రీడాకారులు రాణించి దేశ విదేశాలలో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి మహిళా నేత పేడాడ రమణకుమారి పాల్గొన్నారు

నూతన దంపతులను ఆశీర్వదించిన సుబ్బారెడ్డి



నూతన దంపతులతో వై.వి.సుబ్బారెడ్డి, ఇతర వైసిపి నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : వైసిపి పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు, 96వ వార్డు, పెందుర్తికి చెందిన శరగడం చినఅప్పలనాయుడు కుమారుడు కోడలిని వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ఆశీర్వదించారు అనారోగ్య కారణంగా వివాహానికి హాజరుకాలేక పోయానని, ఇపుడు సిఎం జగన్ సూచనల మేరకు వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు

లాభాల వైపు అడుగులు..

అభివృద్ధి పథంలో పయనిస్తున్న చౌడువాడ పిఎసిఎస్

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు మండలం, చౌడువాడలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) లాభాల వైపు అడుగులు వేస్తోంది. ఈ మండలంలోని ఎ.కోడూరు, పాతవలస సొసైటీలు నష్టాలు ఊబిలో కూరుకుపోయి మూతపడగా, చౌడువాడ సొసైటీ అనేక ఒడుదుడుకులు ఎదుర్కొని నిలబడి నేటికీ రైతులకు సేవలు అందిస్తోంది. చైర్మన్, పాలకవర్గం, సిబ్బంది కృషి, శ్రమతో అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

చౌడువాడ పిఎసిఎస్‌ను 1977లో ప్రారంభించారు. నాడు 20 మంది రైతులు సభ్యులు ఉండగా, నేడు 3,700 మంది ఉన్నారు. ఈ సొసైటీలో చౌడువాడ, మల్లమ్మపాలెం, గరుగుబిల్లి, గొందుపాలెం, రొంగల నాయుడుపాలెం, గుల్లేపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు సభ్యులుగా ఉన్నారు. మొదటిలో ప్రైవేటు భవనంలోనూ తరువాత సొంత భవనంలో విధులు నిర్వహించగా, ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామంలోని పాలకేంద్రం సమీపంలో మల్లంపాలెం రోడ్డు దగ్గర రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు.

ఈ సొసైటీలో ప్రస్తుతం రూ.2.56 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. 68 మందికి రైతులకు దీర్ఘకాలిక రుణాలు 2.80 కోట్లు, స్వల్పకాలిక రుణాలకు 1000 మందికి రూ.5 కోట్లు ఇవ్వడం జరిగింది. వ్యాపారస్తులు గ్రూపులుగా ఏర్పడగా, 21 గ్రూపులకు రూ.36.50 లక్షలు రుణాలు అందజేశారు. తక్కువ వడ్డీతో బంగారం ఆభరణాలపై 150 మందికి కోటి 78 లక్షల రూపాయలు రుణాలు ఇవ్వడం జరిగింది.

సొంత భూమి కలిగి ఉన్న రైతులకు 1బితో స్వల్పకాలిక రుణాలు, బంగారు ఆభరణాలపై రుణ సదుపాయం కల్పించబడుతోంది. కోళ్ల ఫారాలు, పాల డెయిరీలు ఏర్పాటు చేసుకునే వారికి అర్హతను బట్టి రుణాలు ఇస్తున్నారు. భూమి అభివృద్ధికి ఏడు సంవత్సరాల వ్యవధిలో 80 పైసల వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నారు. రైతులు తమ భూముల్లో బోర్లు, మోటార్లు వేసుకునేందుకు దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నారు. ఈ సొసైటీలో రైతులకు రుణ సదుపాయంతో పాటు వారికి కావలసిన ఎరువులు, క్రిమిసంహార మందులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి ఏటా ఈ సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల వద్ద ప్రభుత్వం ప్రకటించిన ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీరుస్తూ అందరికీ అందుబాటులో ఈ సొసైటీ ఉంటుంది. రైతులు తీసుకున్న రుణాలు వారు సకాలంలో చెల్లించే విధంగా సొసైటీ చైర్మన్ రాజి మోది నాయుడు, ముఖ్య కార్యదర్శి బత్తిన సత్యనారాయణమూర్తి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. దీంతో ఇంతవరకు నష్టాల్లో ఉన్న ఈ సొసైటీ ఇప్పుడిప్పుడే లాభాల వైపు పయనం చేస్తోంది.

కొత్తగా నిర్మించిన చౌడువాడ పిఎసిఎస్ భవనం

అన్ని వర్గాల వారికి రుణాలు

సొంత ఇల్లు కలిగిన వారికి ఇంటి తనకాపై రుణ సదుపాయం కల్పిస్తున్నాం. మా సొసైటీలో వ్యక్తిగత రుణాలు కూడా ఇస్తాం. చిన్న వ్యాపారస్తులను ప్రోత్సహించడానికి వారికి వ్యక్తిగత రుణాలు తక్కువ వడ్డీకి అందజేస్తాం.

- రాజి మోదినాయుడు, సొసైటీ చైర్మన్

మాట్లాడుతున్న వరలక్ష్మి

ఎండిఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెనూ విద్యార్థులకు ఉపయోగకరంగా లేదని, ఈ మెనూ వండడం సాధ్యం కాదని, మెనూ మార్చాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనంతో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, దీంతో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎండిఎం కార్మికులను తొలగించడం దారుణమన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, నాణ్యమైన గుడ్లు, బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ శానిటేషన్ కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, వారి వేతనాలు పెంచాలని, పని భద్రత కల్పించాలని కోరారు. ఈనెల 18, 19 తేదీల్లో పరవాడలో జరిగే సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.లక్ష్మి, కె.నాగభూషణం, విజయ కుమారి, జానకి, పార్వతి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

41వ రోజు కొనసాగిన నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఓబి నిర్వాసిత ఎనిమిది గ్రామాల ప్రజలు నేవీ మెయిన్ గేట్ వద్ద చేపట్టిన ఆందోళన 41వ రోజూ కొనసాగింది. శనివారం వేలాదిమంది నిర్వాసితులు రోడ్డుపై బైఠాయించి ఉదయం ఆరు గంటల నుంచి వర్షం కురుస్తున్న ఆందోళన కొనసాగించారు. తమ సమస్యలపై అధికారులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కమ్యూనిటీ టాయిలెట్స్ మంజూరుకు వినతి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ ప్రజలు, ఇక్కడి సముద్ర తీరానికి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం తీరంలో టాయిలెట్స్ ఏర్పాటుకు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని ఎన్‌టిపిసి జిజిఎం గిరీష్ చంద్ర చౌక్సేకు, సిఎస్ఆర్ డిజిఎం ప్రకాస్కు ముత్యాలమ్మ పాలెం సర్పంచి చింతకాయల సుజాత ముత్యాలు శనివారం వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 328లో సర్పంచ్ తన సొంత నిధులతో కొనుగోలు చేసి 15 సెంట్లు భూమిలో ఈ టాయిలెట్‌లు నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మహేను, మండల కో-ఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, చింతకాయల బంధ అప్పయ్య, చిన్నారావు, దేముడు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సుజాతముత్యాలు

మహిళలపై అఘాయిత్యాలను రూపుమాపాలి

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

సామూహిక సీమంతాల్లో పాల్గొన్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలపై ఇంటా బయటా జరుగుతున్న వివక్ష, అఘాయిత్యాలను రూపుమాపాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ నగరం సచివాలయం సమావేశ మందిరంలో శనివారం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మహిళల రక్షణ పట్ల అందరికీ అవగాహన ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీలు, సచివాలయాల సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ మహిళలు మౌనంగా ఉండటం వల్లే వారిపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. కుటుంబాల పరువు పేరుతో నేరాలు వెల్లడించలేదన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఇవ్వాలని, వారితో స్నేహపూర్వకంగా ఉంటూ మానసిక ధైర్యాన్ని, స్థైర్యాన్ని కల్పించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలే మహిళలపై హింసకు మరో కారణమన్నారు. లింగ వివక్షను సమూలంగా నిర్మూలించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు గడ్డం ఉమా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీతామహాలక్ష్మి, కెవిపి మెమోరియల్ ట్రస్ట్ కరణం కళావతి, అడ్వకేట్ యశస్విని, ఉమెన్ ఫైనాన్స్ మెంబర్ బాల వరలక్ష్మి, దిశా సిఐ లక్ష్మి, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో 'వైబ్రంటు డైట్-2022'

మాట్లాడుతున్న డైట్ కళాశాల చైర్మన్ రత్నాకర్

ప్రజాశక్తి-అనకాపల్లి : డైట్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో వైబ్రంట్ డైట్ 2022 కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. కళాశాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు, అతిథులుగా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, కాకినాడ జెఎన్‌టియు విసి డాక్టర్ జివిఆర్ ప్రసాద్ రాజు, ముగింపు రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, అతిథులుగా స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ కెవి.రావు, టెక్ మహేంద్ర డెలివరీ హెడ్ కొల్లూరు రవిచంద్ర హాజరవుతారని తెలిపారు. రెండో రోజు సరిగమప విజేత డాక్టర్ యశస్వి కొండెపూడి బృందం సంగీత కచేరి, విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్ల నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

గృహ సారథులను నియమించాలి

ప్రజాశక్తి - పరవాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గ్రామ గృహ సారథులను నియమించాలని, వారిని ప్రతి వాలంటీర్‌కు మ్యాపింగ్ చెయ్యాలని వైసిపి పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పార్టీ నాయకులకు సూచించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యాన వైసిపి పరవాడ మండల ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించాలని, అందులో ఒకరు మహిళ వుండాలన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 20వ తేదీ లోగా పూర్తి చేసి ఎమ్మెల్యేకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పిటిసి పైల సన్యాసిరాజు, వైస్ ఎంపిపి బూసి అప్పలరాజు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పైలాకు ఘన నివాళి

ప్రజాశక్తి - పరవాడ : వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు తండ్రి అయిన పరవాడ మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడు 18వ వర్ధంతి కార్యక్రమంలో పరవాడ సంతబయలులో శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నపు రెడ్డి అదీప్ రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విచ్చేసి పైలా అప్పలనాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరవాడ, పెందుర్తి ఎంపిపిలు పైల వెంకట పద్మ లక్ష్మి, ముదపాడ నాగమణి అంజి, జడ్పిటిసిలు పైల సన్యాసిరాజు, ఇప్పిలి దేవి కనకరాజు, జివిఎంసి 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, వైస్ ఎంపిపి బూసి అప్పలరాజు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, పైలా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పైలా అప్పలనాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

విద్యా బోధనపై ఆరా తీస్తున్న వెంకటలక్ష్మి

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - కశింకోట : పదవ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిసిడిఓ టి.వెంకట లక్ష్మి అన్నారు. మండలంలోని తేగాడ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం రాత్రి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. పది, ఇంటర్ విద్యార్థులకు విద్యా బోధనను పరిశీలించారు. అదనపు సమయంలో చదువుపై దృష్ట పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.చంద్రకళ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -దేవరాపల్లి : విఆర్‌ఒల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా బి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.జగదీష్ ఉపాధ్యక్షుడిగా డి.కనకరావు, సంయుక్త కార్యదర్శిగా కె.రామకృష్ణ, కోశాధికారిగా పి.జామయ్య, కార్యవర్గ సభ్యురాలుగా పి.దేముడమ్మ, ఇ.గంగునాయుడుతో పాటు 9 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం ఈ నూతన కమిటీ జాబితాను తహశీల్దార్ ఎం.లక్ష్మికి అందజేశారు. జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడిగా డి.కాసప్పు, డివిజన్ కమిటీ సభ్యుడిగా సిహెచ్. సూర్యనారాయణ ఉన్నట్లు వారి తెలిపారు.

7 రోజుల్లో వంతెన మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్ వద్ద గల వంతెనకు మరమ్మతులు వారం రోజుల్లో పూర్తి చేస్తామని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అధికారులు తెలిపారు. మరమ్మతులకు గురైన వంతెనను బుచ్చయ్యపేట జడ్‌పిటిసి దొండా రాంబాబు, ఫ్యాక్టరీ అధికారులు రాము, మధుసూదన్ రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుగర్ ఫ్యాక్టరీకి వాహనాలపై చెరుకు రవాణా చేసేందుకు వీలుగా కాంక్రీట్ వేసి మరమ్మతులు చేపడతామని తెలిపారు.

గరిశింగిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండలంలోని గరిశింగి గ్రామంలో ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 30 మందికి కంటి పరీక్షలు చేసి, అందులో 15 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంపు బృందం, ఆశా కార్యకర్త, గ్రామ యువకుడు కిల్లి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శూలాల మహోత్సవం

ప్రజాశక్తి - అచ్యుతాపురం : మండలంలోని చోడపల్లి చోడమాంబిక దేవాలయ ఆవరణలో శుక్రవారం రాత్రి దుర్గా మాత భవానీల అగ్నిగుండం, శూలాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గురు భవానీ కాకి శంకర్రావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో భవాని మాలలు ధరించి శక్తి శూలాలు, గంప శూలాలు, బుగ్గ శూలాలతో అగ్నిగుండం తొక్కారు. భవానీలకు చద్దిని కర్రి వెంకటరమణ, నాగేశ్వరావు బ్రదర్స్ ఏర్పాటు చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామంలో ట్రినిటి గాస్పల్ చర్చిలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జోబ్ దాస్ మాట్లాడుతూ దేశంలో ప్రపంచ శాంతికి ప్రతీకగా నిలిచిన వ్యక్తి ఏసుక్రీస్తు అని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆయన చూపిన ఆజ్ఞలు ప్రకారం నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ సిహెచ్ జాన్సన్, స్థానిక సంఘ పాస్టర్ విజయరాజు, జాన్ సామ్యూల్, డానియల్, మాణిక్యరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్రైస్తవ బోధకుడు

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

పెళ్లి సంబంధం చూడడమే కారణమంటున్న కుటుంబీకులు

మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వరుణ్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - దేవరాపల్లి

మండలంలోని వేచలం సబ్ స్టేషన్, సచివాలయం పరిధిలో ఎలక్ట్రికల్ ఎనర్జీ అసిస్టెంట్ (లైన్‌మెన్)గా విధులు నిర్వహిస్తున్న దేవరాపల్లి గ్రామానికి చెందిన గొర్లె వరుణ్ కుమార్ (31) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... తండ్రి లేకపోవడంతో గొర్లె వరుణ్‌కుమార్ తను తల్లితో కలిసి దేవరాపల్లి బీసీ వీధిలో మేనమామ ఇంట్లో నివాసముంటున్నారు. వరుణ్‌కుమార్ శనివారం ఉదయం స్నానం చేసి వస్తానని చెప్పి రెండవ అంతస్తు గదిలోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకొని ఎంతకి రాలేదు. అనుమానం వచ్చి ఫోన్ చేయగా, ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో గది తలుపులు బద్దలు కొట్టి చూసేసరికి స్లాబ్ హుక్‌కి తాడుతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. ఊపిరి ఉందేమోనని ఆశతో తాడు తొలగించి కిందకు దించేసరికి వరుణ్ మృతి చెంది ఉన్నారు. దంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పెళ్లి సంబంధం చూడడమే కారణం

ఉద్యోగం రావడంతో పెళ్లి చేసుకోవాలని వరుణ్‌కుమార్‌ను కుటుంబీకులు కోరగా, ఇంకా కొంత సమయం కావాలని కోరాడు. అయినా కుటుంబీకులు తమ ప్రయత్నాలు మానకుండా బలవంతంగా పెళ్లి సంబంధం కుదుర్చి నిశ్చితార్థం ముహూర్తం కూడా పెట్టారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి తల్లి పైడితల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జి ఎస్ఐ బి.రామకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించి, మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి డిప్యూటీ సిఎం పరామర్శ

మృతుడి వరుణ్‌కుమార్ కుటుంబాన్ని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పరామర్శించారు. మృతుడు తల్లి పైడితల్లమ్మను, మేనమామ అల్లు నాయుడును ఓదార్చారు.

ఆర్‌టిఐ చట్టం ద్వారా సమాచారం ఇవ్వాల్సిందే..

విచారణ జరుపుతున్న డిఆర్‌ఒ వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి

సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని తక్షణమే ఇవ్వాల్సిందేనని జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్‌టిఐ చట్టం నోడల్ అధికారి వెంకటరమణ ఆదేశించారు. ఆర్‌టిఐ చట్టం 21 మొదటి అప్పీళ్ల విచారణ శనివారం డిఆర్ఒ ఛాంబర్లో జరిగింది. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం ఏర్పడిన నాటి నుంచి సమాచారం కోసం దరఖాస్తు చేసిన తేదీ వరకు వివిధ కేటగిరీల అధికారులు, ఉద్యోగులకు జారీ చేసిన మెమోలు, షోకాస్ నోటీసులు, ఛార్జ్ మెమోలు, సస్పెండ్లు, సరెండర్లు, క్రమశిక్షణ చర్యలు, సిఫార్సు నోటీసులు తదితర అంశాలపై ఆర్‌టిఐ ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ చేసిన రెండు దరఖాస్తులకు కలెక్టర్ కార్యాలయ పిఐఓ స్పందించని కారణంగా ఈ ఏడాది నవంబర్ 11న మొదటి అప్పీళ్లు దాఖలు చేశారు. దీనిపై ఆర్‌టిఐ నోడల్ ఆఫీసర్ వెంకటరమణ శనివారం విచారణ చేపట్టారు. దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నాలుగు వారాల్లోగా అందజేయాలని పిఐఓ ఎ.శ్రీనివాసరావును ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం ప్రారంభమై ఏడు నెలలు దాటినా స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన ఆర్టిఐ చట్టం సెక్షన్ 4(1)బి పూర్తి వివరాలు రూపొందించలేదని మరో అప్పీలులో కాండ్రేగుల వెంకటరమణ వాదించగా తక్షణం సమాచారాన్ని అందజేయకపోతే ఆర్టిఐ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవలసి వస్తుందని పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావును డిఆర్ఓ హెచ్చరించారు.

జీవించే హక్కుకు భంగం కలిగితే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి

జీవించే హక్కుకు భంగం వాటిల్లితే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాలని ఫిర్యాదు చేయాలని పబ్లిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, సమాచార హక్కు చట్టం ఉద్యమ కర్త కాండ్రేగుల వెంకటరమణ సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో శనివారం ఎన్‌హెచ్ఆర్‌సిఎఫ్, హ్యూమన్ రైట్స్, సర్వేజనా ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదబయలు తహశీల్దారు ఒక ఐఎఎస్ అధికారి ఆగ్రహం, పని ఒత్తిడి కారణంగా బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్‌పై కరపత్రాన్ని విడుదల చేశారు. కోరుబిల్లి పరమేశ్వరరావు, రేబాక మధు బాబు, దూలం గోపి, గంటి రవికుమార్, అమ్మిశెట్టి లక్ష్మణరావు, సూదికొండ మాణిక్యాలరావు, పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో బుచ్చయ్యపేటలో శనివారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గాడి బాలు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అధికశాతం భాగస్వామ్యం వహిస్తున్న వ్యవసాయ కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. అరవై సంవత్సరాలు పైబడిన కార్మికులకు నెలకు కనీసం రూ.10వేలు పింఛను ఇవ్వాలని, మహిళా కార్మికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని, డిమాండ్ చేశారు.

మాకవరపాలెం : మండలంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తామరం గ్రామానికి చెందిన నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ శర్మ ఇంటి వద్ద సమావేశం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు కె రమణ కుమార్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో ఈ సమావేశం నిర్వహించినట్లు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కె.కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు హుమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

అందజేసిన కుట్టు మిషన్లతో మహిళలు

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్టలో శుక్రవారం రాత్రి సిఎల్‌సి చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 43 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పేద ప్రజలకు వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా సిఎల్సి చర్చ్ ప్రతినిధి జోసెఫ్ మహంతి మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలంలో సుమారు పది సంవత్సరాల నుంచి అనేక తాగునీటి బోర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి, స్థానిక సర్పంచులు మెరుగు కుమారి బాబురావు, తమరాన శ్రీనివాసరావు, నాయకులు తమరణ వెంకటరమణ, చర్చ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న గ్రామీణ రోడ్లు

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని గ్రామీణ రోడ్లు వర్షపు నీటితో చెరువులను తలపించే విధంగా ఉన్నాయని, అయినా అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదని బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు విమర్శించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని తుమ్మపాల వెంకుపాలెం రోడ్లో ముడుకుల లోతు నీరు నిల్వ ఉండడంతో ఆ ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. చిన్నపాటి వర్షానికి మండలంలోని అనేక రోడ్లు జలమయమయ్యాయని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు. తక్షణమే డ్రైనేజీల అవుట్లెట్స్ ఏర్పాట్లు చేయాలని కోరారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి పాలనలో రాష్ట్రంతో అభివృద్ధి కుంటుపడిందని టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర అన్నారు. శనివారం పట్టణంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని కూండ్రం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పచ్చికూర రాము, నందారావు సూరిబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మారుశెట్టి శంకర్రావు, అడ్డూరి శంకర్రావు, పొట్నూరి తిరుపతయ్య, కింతాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ర్యాలీలో పాల్గొన్న ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవిత బీమా ఏజెంట్లు, కష్టమర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆలిండియా ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన పిలుపుమేరకు హైదరాబాదులో నిర్వహించిన ర్యాలీలో అనకాపల్లి జిల్లాకు చెందిన ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి బ్రాంచి అధ్యక్షులు పెంటకోట సైదునాయుడు మాట్లాడుతూ పాలసీ హోల్డర్‌కు బోనస్ పెంచాలని, జీఎస్టీ రద్దు చేసి పాత విధానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొర్లె శంకర్రావు, వెన్నెల సన్యాసిరావు, కరణం మాణిక్యం, పీలా శ్రీనివాస్, కొణతాల నూక అప్పారావు, రొంగలి వెంకటరావు, అలంక నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఈనెల 21వ తేదీ నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని, ఇందు కోసం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడీఓ రవికుమార్ ఆదేశించారు. మండలంలోని గణపర్తిలో హౌసింగ్ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఇపిఆర్‌డి పి. ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, అసిస్టెంట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రవికుమార్

ప్రజలకు నిస్వార్థంగా సేవలు

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ శ్రీధర్ రెడ్డి

చీడిక గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీడిక గ్రామంలో శనివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని రాష్ట్ర కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, విశాఖ ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ శివ నాగేంద్రరెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి రమణ ముఖ్య అతిథిగా హాజరై రెడ్ క్రాస్ సేవలను వివరించారు. అనంతరం చీడిక గ్రామస్థులకు రెడ్ క్రాస్ సొసైటీ తరపున వంట సామగ్రి, దోమ తెరలు, శానిటరీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర అధ్య క్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, మారుమూల గ్రామాలు, నిరుపేద ప్రజలు, ఎస్సీ, ఎస్టీలకు నిరంతరం అనేక సేవలందించడమే లక్ష్యంగా దశాబ్దాల కాలం నుంచి తమ సొసైటీ పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సామగ్రి కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

పార్టీలకతీతంగా పథకాలు

ప్రజాశక్తి:మాకవరపాలెం :పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ తెలిపారు. బంచ్చన్నపాలెం పంచాయతీలో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇంకా సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే స్థానిక సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు వాసు, బీమిరెడ్డి గోవిందం పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చిరుజల్లులతో...రైతన్నకు తీవ్ర నష్టం

-పొలాల్లో తడిసి ముద్దయిన వరి పనలు -కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు

నక్కపల్లిలో తడిసిన వరి పనలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎంతో కష్టపడి పండించిన వరి కళ్ళముందే వర్షానికి తడిసి ముద్దయి నాశనం అవ్వడంతో రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుఫాన్ ప్రభావంతో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షానికి పొలాల్లో ఉన్న వరి పనలు తడిసిపోయాయి. గాలికి వరి చేను నేలకొరిగింది. వరి చేతికందే సమయంలో తుఫాను ప్రభావం వల్ల నష్టం వాటిల్లడంతో రైతులు దిగులు చెందుతున్నారు.మండలంలో వరి విస్తారంగా పండింది.చాలా గ్రామాల్లో వరి కోతలు కూడా ప్రారంభించారు. తుఫాన్ ప్రభావం నేపథ్యంలో పలు గ్రామాల్లో రైతులు అప్రమత్తమై కోసిన వరి పనలను ఆరకముందే యుద్ధ ప్రాతిపదికన కుప్పలు వేశారు. చాలా గ్రామాల్లో కోసిన వరి కుప్పలు వేయడానికి అవకాశం లేకపోవడంతో పొలాల్లోనే ఉంచారు. శనివారం ఉదయం నుండి జల్లులు జల్లులుగా వర్షం కురవడంతో కోసిన వరి పనలు పూర్తిగా తడిసిపోయాయి. తుఫాన్ ప్రభావంతో గాలి కూడా వీయడంతో వరి చేను నేలకొరిగింది. రైతులు పెద్ద మొత్తంలో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. వరి పంట చేతికందే సమయంలో తుఫాన్ ప్రభావంతో నష్టం వాటిల్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వరి పనలు తడిసి పోవడం వలన ధాన్యం గింజలు పొలాల్లో రాలిపోతాయని, మిగిలి ఉన్న ధాన్యం క్వాలిటీ కూడా పూర్తిగా దెబ్బతింటుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు .పంట చేతికందే చివరి క్షణంలో వర్షం తీవ్ర నష్టం మిగిల్చిందని ఆవేదన వెలిబుచ్చారు.

పంట పొలాల్లో రైతన్నల పరుగులు

వరి పనలను కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:వాయుగుండం కారణంగా శనివారం తెల్లవారు జాము నుండి వాతావరణం మారి చిరు జల్లులు కురుశాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు పొలాల్లోకి పరుగులు తీశారు. ఇప్పటికే 95 శాతం వరి కోతలకు సిద్ధం కావడంతో రైతులు అల్లాడుతున్నారు.వారం రోజులుగా కొంతమంది రైతులు వరిని కోసి పొలాల్లో ఆర బెట్టారు. చినుకులు పడడంతో కొంతమంది రైతులు వరి పనులను తిరగవేసె పనిలో పడ్డారు. కోసిన వరి చేను తలవడంతో ధాన్యంలో తేమ పెరిగి పోతుందని రైతులు లబో దిబోమంటున్నారు. ఈ ఏడాది వరి పంట చేతికి అందే దశలో ఈ తుఫాను తీవ్ర నష్టపరిందని రైతులు అంటున్నారు.

కోటవురట్ల: మండుస్ తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా కోతలు పూర్తయిన వరి పంటలు దెబ్బతిన్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన చిరు జల్లులు శనివారం కూడా కొనసాగాయి. అదేవిధంగా కోతకు సిద్ధంగా ఉన్న పంట సైతం వర్షానికి దెబ్బతింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట తడిసి పోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

మాకవరపాలెంలో...

వరి రైతుల్లో కలవరం

రావికమతం:తుఫాను హెచ్చరికతో వరి రైతుల్లో కలవరం మొదలైంది. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంతో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో రైతుల్లో మరింత గుబులు పుట్టిస్తుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు పడడంతో వరి రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలో 355 ఎకరాలలో వరి పంట పొలాల్లో కోసి ఆరబెట్టారు. కోతకు సిద్ధంగా ఉన్న మరో రెండు వేల ఎకరాలు నేడో రేపో కోతకోయాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించక పోవడం, చిరుజల్లులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పండిన పంట చేతికందే సమయంలో అడపాదడపా జల్లులు పడుతుండటంతో వరి పంటను కోసిన రైతులు చేను ఆరక ముందే పొలాల్లోనే చిన్నచిన్న కుప్పలుగా పెడుతున్నారు. పంట పండి కోతకు సిద్ధంగా ఉన్న వారిని కోద్దమంటే తుఫాను భయం వెంటాడుతుంది. పండిన పంట తడిస్తే గత ఏడాది వలె మొలకెత్తి అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

మండలంలో రావికమతం, కొమిరా, మేడివాడ, చినపాచిల, మరుపాక, గొంప, గుడ్డిప, కేబీపీ అగ్రహారం, కవగుంట తదితర గ్రామాలలో ఈ పరిస్థితి నెలకొంది. పెట్టుబడులకు చేసిన అప్పులు తీరే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది తుఫానుకు వర్షాలు వరి రైతులను పూర్తిగా దెబ్బతీసాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొనడంతో కుదిలైపోతామని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నక్కపల్లిలో ఒరిగిన వరి పనలు

రావికమతంలో కుప్పలు ఎత్తుతున్న రైతులు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ఎఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చీడికాడ: తుఫాన్ ప్రభావం కారణంగా వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో కోసిన పంటలను నూర్పులు చేయవద్దని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ కోరారు.ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, కోసిన వరి పైరు తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు పనల పై 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రైతులను కోరారు. పొలంలో ఎక్కువగా నీరు నిల్వ ఉంటే కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. ఎండ రాగానే పండిన వరి చేలను కోసి పనలుగా అరబెట్టుకోవాలని, అవసరాన్ని బట్టి 50 కేజీల కళ్ళు ఉప్పును కోసిన పనల పై చల్లితే గింజ రంగు మారదని, మొలకెత్తదని అన్నారు. ప్రతి రైతు కూడా వాతావరణ పరిస్థితులను చూసుకొని వరి కోతులు కోయాలన్నారు.

తడిసిన వరి పనలు

తడిసిన వరి చేను

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మాండిస్ తుపాన్ ప్రభావంతో మండలంలో శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఈ చిరుజల్లులు వరి రైతులు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని కందిపూడి, రాజాం, పెదపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు కోసిన వరి పంట పొలాల్లోనే ఉండిపోయింది. శనివారం కురిసిన వర్షానికి వరి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

కశింకోట : మండలంలో శనివారం ఉదయం నుండి చిరు జల్లు పడ్డాయి. వరి చేలు కోత దశ ఉండడం వల్ల కశింకోట, బయ్యవరం, ఏనుగు తుని, ఎన్‌జి పాలెం రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముందుగా కుప్పలు పెట్టుకున్న రైతులు

అచ్యుతాపురం : తుఫాన్ హెచ్చరికలతో మండలంలోని వరి రైతులు జాగ్రత్తపడ్డారు. కోసిన వరి పనలను కుప్పలగా పెట్టారు. కోతకు సిద్ధంగా ఉన్న వాటిని వాయిదా వేశారు. శుక్రవారం రాత్రి, శనివారం మధ్యాహ్నం నుంచి చెదురు మదురుగాగా వర్షం పడుతుంది. ఇంతకంటే వర్షం గట్టిగా పడిన, గాలులు వీచిన వరి పంట నేలకొరుగుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రాజకీయ దూరాలోచనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

బ్రిటిష్ స్టేట్స్‌మన్ బెంజిమన్ డిజ్రేలి మాటల్లో చెప్పాలంటే 'రాజకీయ పరిభాషలో ముగింపు అనేది ఉండదు". ప్రజల సమస్యలను కాకుండా తెరపై తమ అజెండా పాపులర్ అయ్యేలా పావులు (మ్యానుపులేషన్) కదపడంలో ప్రధాన రాజకీయ పార్టీలు అత్యంత సందడి సందడిగా కనిపిస్తుంటాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఈ స్పీడ్ మరింతగా పెరగడం తెలిసిందే. గడచిన వారం రోజులుగా విశాఖలో ఈ హడావుడి మరింత బాహాటంగా కనిపిస్తోంది.

విశాఖపై జివిఎల్ ప్రేమ....

విశాఖను ఇలాంటి వారంతా ప్రేమించే నగరంగా చెప్పొచ్చు. ఇక్కడ రాజకీయ నాయకుడిగా మారితే సొంతంగా అనేక అద్భుతాలను చేజిక్కించుకోవచ్చు. విశాఖే అయితే... దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఒక్క వెలుగు వెలగడం ద్వారా తమ వ్యవహారాలన్నిటినీ పరిష్కరించేసుకోవచ్చు. ఇది నేటి ఈ నేతలంతా ఉవ్విల్లూరుతున్న దానికి అసలు కారణం. అందుకే 2023 ఎన్నికల్లో బిజెపి ఎంపీగా పోటీకి విశాఖనే ఎంచుకున్నారీయన. ఈ కాలంలో ఈ విషయంలో అగ్రభాగాన నిలిచిన నాయకుడు బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు. ఈయనకు ఒక్కసారిగా విశాఖనగరంపై ప్రేమ పుట్టుకొచ్చేసింది. కొన్నాళ్లుగా విశాఖ నగరంలోనే తచ్చాడుతూ పలు అంశాలపై ఉచిత ప్రసంగాలు చేసేస్తూ తనదైన శైలిలో నగరంలో కలియతిరుగుతున్నారు. విశాఖ పోర్టు ట్రస్ట్ (ఓడరేవు) ద్వారా కోకింగ్ కోల్, స్టీమ్ కోల్, ఇతర అన్ని రకాల కార్యకలాపాల నుంచి ఉత్పత్తి అయ్యే ధూళి ఉద్గారాల వల్ల వెలువడే కాలుష్యంతో విశాఖ పరిసర ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురౌతున్నారంటూ తాజాగా ఏకరువు పెట్టారు. 1930వ దశకంలో విశాఖ జనాభా నామమాత్రంగా ఉన్నప్పుడు పోర్టు ఏర్పాటైంది. ఇప్పుడు లక్షల్లో జనాలు పెరిగిపోయారు. కాబట్టి అనేక నిర్దిష్టచర్యలు పోర్టు తీసుకుంటూ వస్తోంది. "వైజాగ్ పోర్టు ఉండాలి... విశాఖ ప్రజలూ బతకాలి" అనే నినాదంతో 'మోడర్న్ కవర్డ్ స్టోరేజీ' వ్యవస్థలను పోర్టులో అభివృద్ధి చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న జివిఎల్ ఎదురయ్యే ప్రశ్నలు, సమస్యలకు సమాధానం చెప్పే స్థానంలో ఉండి ఆయనే ప్రశ్నలను సంధించడం బిజెపి మార్క్ పాలనకు దర్పణం పడుతోంది.

గంటాతో పార్టీలకు మళ్లీ తంటా తప్పదా?

విశాఖకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, టిడిపికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అధికార పార్టీలోకి మారుతున్నట్లు ఊహాగాన ప్రచారాలు ఊపందుకున్న సంగతి తెలిసిందే. వారం రోజులకు పైగా ఈ వ్యవహారం పత్రికలు, ఛానెళ్లలో ప్రసారం జరిగినా ఆయన నోట వెంట ఒక్కమాటా వెలువడలేదు. 2023 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇవన్నీ సాధారణమే అయినా గంటా కదలికలపై అందరిచూపు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఆయన ఎక్కడకెళితే ఆ పార్టీకి చెందిన పార్టీ టికెట్ ఆశించే నేత పని (రాజకీయ భవిష్యత్తు) క్లోజ్ అయిపోయినట్టే లెక్క. ఒకవేళ భీమిలి తెలుగుదేశం పార్టీ నుంచే పోటీకి దిగితే పెద్ద వివాదమేమీ ఉండకపోవచ్చు. వైసిపికి జంప్ అయి గంటా భీమిలి నుంచి టికెట్ ఆశిస్తే ముత్తంశెట్టి గందరగోళంలో పడడం ఖాయం.

విశాఖలోనే నేతల మకాం...

సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ ఇటీవల కాలంలో విశాఖలోనే అత్యధికంగా గడుపుతున్నారు. తాజాగా ప్రకటన చేస్తూ తాను విశాఖ నుంచే ఎంపీగా పోటీకి దిగుతానంటూ చెప్పారు. అయితే తాను ఏ పార్టీ నుంచి బరిలో ఉండబోతున్నారో మాత్రం వెల్లడించలేదు. గతంలో జనసేన అభ్యర్థిగా విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసిన విషయం తెలిసిందే. ఈ సారి ఆ పార్టీకి మాత్రం అంత దగ్గరగా లేరన్నది తెలుస్తోంది. జనసేన రాష్ట్ర నేత నాదెండ్ల మనోహర్ తాజాగా విశాఖలో ప్రకటిస్తూ 2023 జనవరి 12న శ్రీకాకుళం జిల్లా రాజాంలో భారీ యువసభ నిర్వహిస్తున్నామని దానికి తమ పార్టీ నేత పవన్‌కళ్యాణ్ హాజరవుతారని ప్రకటించారు. విశాఖ కేంద్రంగా రాజకీయ పరిణామాలు శరవేగంగా నడుస్తున్నాయనడానికి ప్రధాన పార్టీల్లో కదలికలు వెల్లడిచేస్తున్నాయి. అధికార వైసిపి మాత్రం వ్యవస్థాగత సర్దుబాట్లలో నిమగ్నమైంది. నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు, ఓటర్లను సైతం ముఖ్యమంత్రి జగన్ తాను రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్న 'ప్రత్యేక నెట్‌వర్క్' ద్వారా స్క్రూటినీ, టికెట్ల వ్యవహారంపై సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. విశాఖ రుషికొండపై ప్రభుత్వ అతిథి గృహాలు, సిఎం కేంప్ కార్యాలయ నిర్మాణ పనులు కూడా అంతే వేగంగా సాగడం విశేషం. ప్రధాన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నేతలు ప్రెస్‌మీట్లతో బిజీబిజీగా గడుపుతున్నారు.

ఏ మాటకామాట చెప్పుకోవాలి...

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కేంద్ర సర్కారు ప్రయత్నిస్తున్న తరుణంలో నిర్విఘ్నంగా 665రోజులకు పైగా ట్రేడ్‌యూనియన్‌లు, ప్రజలు పోరాడుతున్నారు. ఆరునూరైనా స్టీల్‌ప్లాంట్‌ను అమ్మి తీరతాం.. అంటూ ఢిల్లీకి చెందిన దీపమ్ అధికారులు తాజాగా కూడా ప్రకటించడం బిజెపి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాన్ని పట్టిచూపుతోంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మాత్రం రాజకీయ పార్టీలు కలసికట్టుగా కదలకపోవడం అత్యంత దురదృష్టకరమైన విషయం. వీరికి రాజకీయ 'దురా'లోచనలే తప్ప నగర అభివృద్ధిపై దూరాలోచన అసలు ఉంటుందా? అన్నది అనుమానమే.

పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, డైరెక్టర్లు

బాక్సింగ్ పోటీల్లో ఐదు పతకాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: ఈ నెల 9న ఆంధ్రా యూనివర్శిటీలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఐదుగురు మహిళా బాక్సర్లు పతకాలు సాధించారు. 66 కేజీల విభాగంలో లాలం ప్రవల్లికకు రజత పతకం, 57 కేజీల విభాగంలో కొలుకుల కృష్ణవేణికి సిల్వర్, బెస్ట్ లూసర్ అవార్డు వచ్చింది. 75 కేజీల విభాగంలో వేపాడ ప్రియాంక, 46 కేజీల విభాగంలో కుపరాల శాంతికుమారి, 54 కేజీల విభాగంలో పెద్దపాతిని రజని కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు, శాప్ కోచ్ అబ్బు తెలిపారు. వీరికి బాక్సింగ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, డిగ్రీ కళాశాల పిడి ఎస్.సురేష్‌బాబు, బుల్లయ్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు మెడల్స్ వేసి అభినందించారు. ఈ సందర్భంగా నింజాస్ అకాడమీ డైరెక్టర్లు, తల్లిదండ్రులు, తోటి బాక్సర్లు వీరిని అభినందించారు.

శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-నక్కపల్లి : ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు శనివారం మండలంలో కాగిత హెూటల్ జాస్ వద్ద జిల్లా ఏపీయుడబ్ల్యుజే ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అమరావతి నుంచి విశాఖ వెళ్తున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరావుకు ఏపీయుడబ్ల్యుజే ప్రతినిధులతో పాటు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు స్వాగతం పలికారు. జిల్లా ప్రతినిధులు స్వామి, కోరాడ చంద్రరావు, పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆచంట రామకృష్ణ, సంఘ ప్రతినిధులు గట్టెం వెంకటరమణ, రమణబాబు, లోవరాజు, సత్యనారాయణ, అశోక్ తదితరులు సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. స్థానిక జర్నలిస్టులతో ఆయన పలు అంశాలపై చర్చించారు.

'శ్రీనివాస మినీ వ్యాన్ ఓనర్స్' కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: మున్సిపాలిటీ శారదానగర్ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివా వాస మినీ వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గొలుసు నరసింహమూర్తి, మాజీ వైస్ ఛైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, సీనియర్ వైసిపి నాయకులు గుడబండి నాగేశ్వరరావు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, 21వ వార్డు కౌన్సిలర్ కర్రి వీలీల చైతన్య, నూకాంబిక గుడి ఛైర్మన్ ధనిమిరెడ్డి నాగు, శ్రీనివాస మినీ వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కర్రి గోవిందు, సెక్రెటరీ సత్తిబాబు, ముఖ్య సలహాదారుడు అజయ్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైసిపి నేతలు

జగనన్న గృహాలు సత్వరంగా నిర్మించాలి

జగనన్న కాలనీ లే అవుట్‌ను సందర్శిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి గ్రామంలో జగనన్న కాలనీలను శనివారం ఎంపిడిఒ డేవిడ్‌రాజు, హౌసింగ్ ఏఈ మధు పరిశీలించారు. ఇళ్లు నిర్మించని వారు వెంటనే నిర్మించుకోవాలని, లేదంటే పట్టాలు రద్దు అయ్యే అవకాశం ఉందని, కట్టిన వారికి వెంటనే బిల్లులు చెల్లిస్తామని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎంసి ఛైర్మన్ కొల్లు సత్యనారాయణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ చిరంజీవి, కొల్లు లోవరాజు, సచివాలయ సిబ్బంది వంగ నవీన్, గ్రామ వాలంటీర్లు, పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై అవగాహన

కోటవురట్ల: మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జగనన్న గృహ నిర్మాణాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన లే అవుట్లు సహా పలు గ్రామాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సిమ్మెంటు, ఇసుక, ఐరన్, అదేవిధంగా డోర్లు, కిటికీలు అందిస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేశారు. మంజూరైన ప్రతి ఒక్కరు ఇల్లు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కాలనీల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజనీరు జగదీశ్వరరావు, పిఆర్‌జెఈ వర్మ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

12న ట్రై సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లకు ప్రభుత్వం అందజేసిన ట్రై సైకిళ్లను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా గ్రామ పంచాయతీలకు ఈ నెల 12న అందజేయడం జరుగుతుందని ఈఒపిఆర్‌డి లాలం సీతయ్య తెలిపారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో పాటు మండల పరిషత్ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

నాగులాపల్లి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నాగులాపల్లి గ్రోయిన్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నాయకులు గ్రోయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ మాట్లాడుతూ గ్రోయింగ్ శిథిలావస్థకు చేరడంతో వర్షపు నీరు వృథాగా పోతుందని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని దానికి మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పులి అప్పారావు, మురిపాల రాము, అయిత రమణ, బంటు నాగేశ్వరరావు, బాబ్జి పాల్గొన్నారు.

గ్రోయిన్‌ను చూపుతున్న నాయకులు

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమంలో వైసిపి అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. అనర్హులను ఓటర్లుగా చేర్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తుందని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. వాలంటీర్లకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి పనులు అప్పగించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చినా జగన్ రెడ్డి ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కిందని ఆరోపించారు. వాలంటీర్లు అధికార పార్టీకి అనుకూలమైన వారి ఓట్లే నమోదు చేసి, ప్రతిపక్షాలకు చెందిన వారి ఓట్లను తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. 5, 10 తరగతులు చదువుకున్న వారిని సైతం ఓటర్ల జాబితాలో వాలంటీర్లు నమోదు చేశారంటే అధికార పార్టీ నాయకులు ఏ మేరకు ఒత్తిడి తెచ్చారో అర్థమవుతుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు లాలం కాశి నాయుడు, కరిమిశెట్టి నరసింగరావు పాల్గొన్నారు.